నిఘా వ్యవస్థను మెరుగుపరచాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిఘా వ్యవస్థను పెంచాలి. నిఘా అనేది ఉంటే అరాచకాలకు పాల్పడే వారు వెనక్కి తగ్గుతారు. అలాగే ఆస్పత్రుల్లో చెక్ పాయింట్ల వద్ద నిబంధనలు కఠినతరం చేస్తే అవాంఛనీయ వ్యక్తులకు అడ్డుకట్ట వేయవచ్చు. అలాగే పోలీస్ ఔట్‌పోస్టులు కూడా ఏర్పాటు చేస్తే మంచి ఫలితం ఉంటుంది. ఇటువంటి చర్యలు తీసుకుంటే వైద్యులకు, వైద్య సిబ్బందికి రక్షణ ఉంటుంది.

– డాక్టర్ కె.పి.నాయుడు, 49వ వార్డు, ఏఎస్ఆర్‌నగర్ యూపీహెచ్‌సీ



వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి



ఆస్పత్రుల్లో పనిచేసే డాక్టర్లు, మహిళా వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి. రాత్రి సమయంలో తగినంత వెలుతురు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే ఎటువంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు ఆస్కారం ఉంటుంది. ప్రభుత్వం తరఫున సెక్యూరిటీ, పోలీస్ అవుట్‌పోస్టు ఏర్పాటు చేస్తే వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ ఉంటుంది. ప్రజల ప్రాణాలు కాపాడే వైద్య సిబ్బందిపై దాడులు ఎంత మాత్రం తగదు. ఈ విషయంలో ప్రజల్లో అవగాహన రావాలి.

– డాక్టర్ వెంకటేష్, 51వ వార్డు, అంబేద్కర్‌కాలనీ యూపీహెచ్‌సీ సెంటర్



సత్యం జంక్షన్ హైవేపై గోతులు



మద్దిలపాలెం హైవేపై గల గోతులు



గురుద్వారా జంక్షన్ రహదారిలో గోతులు

రహదారికి కడ'గండ్లు'

సాధారణంగా జీవీఎంసీ రోడ్ల కన్నా జాతీయ రహదారి నాణ్యత బాగుంటుంది. ఎక్కువ సంవత్సరాలు మన్నుతుంది అన్న సంగతి తెలిసిందే. జాతీయ రహదారుల సంస్థ వార్షిక నిర్వహణ కాంట్రాక్టర్ ద్వారా ఎప్పటికప్పుడు గోతులకు ప్యాచ్‌వర్కులు చేస్తుంటారు. కాని నియోజకవర్గం పరిధిలోని జాతీయ రహదారిలో పలు రోడ్లను చూస్తుంటే కొన్ని సంవత్సరాలుగా ఈ ప్యాచ్ వర్కులు జరగలేదేమో అన్న అనుమానం కలుగుతోంది.

- గోతులమయంగా నేషనల్ హైవే
- వాహన చోదకుల అవస్థలు

సీతమ్మధార : సత్యం జంక్షన్ నుంచి మద్దిలపాలెం వరకు, మద్దిలపాలెం నుంచి ఇసుక తోట వరకు, కొత్త వెంకోజీపాలెం నుంచి హనుమంతవాక జంక్షన్ వరకు గల జాతీయ రహదారి రెండు వైపులా పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వాహన చోదకుల సహనానికి పరీక్ష పెడుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పలు రోడ్లు గోతులమయంగా తయారయ్యాయి. ఇంతకు ముందు కురిసిన వర్షాలకు పడిన గోతులు పూడ్చక ముందే మళ్లీ కొత్త గోతులు సిద్ధం కావడంతో వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇలా రోడ్లు గోతులమయం కావడంతో వాహన చోదకులు స్కిడ్ అయి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక వర్షాల సమయంలో అయితే వాహన చోదకులు నరకం చూస్తున్నారంటే అతిశయోక్తి కాదు. వర్షాలు పడుతున్నప్పుడు గోతులు వర్షపు నీటితో నిండిపోయి కనిపించక వాహన చోదకులు పడరాని పాట్లు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కోల్‌కతా నుంచి చెన్నై మార్గంలో రాకపోకలు సాగించే భారీ వాహనాల కారణంగా ఈ గోతులు మరింత పెద్దవవుతున్నాయి. ప్యాచ్‌వర్కులు సకాలంలో జరగకపోవడంతోనే ఇలా జరుగుతుందని వాహన చోదకులు వాపోతున్నారు.

జోన్–3 పరిధిలో గోతులమయంగా హైవే..

జీవీఎంసీ జోన్–3 పరిధిలో గల జాతీయ రహదారి మీద పలు గోతులు ఏర్పడ్డాయి. ఇవి రోడ్డుకు ఇరువైపులా ఉండడం గమనార్హం. సత్యం జంక్షన్, మద్దిలపాలెం, ఇసుక తోట వరకు, కొత్త వెంకోజీపాలెం, హనుమంతవాక జంక్షన్ వంటి రద్దీ రహదారుల్లో గోతులు ఏర్పడి సులువుగా వాహనాలు ప్రయాణించే వెసులుబాటు లేకుండా పోయింది. అలాగే గురుద్వారా నుంచి అక్కయ్యపాలెం వరకు, గురుద్వారా నుంచి సత్యం జంక్షన్ వరకు కూడా జాతీయ రహదారి అధ్వానంగా తయారయిందని వాహన చోదకులు గగ్గోలు పెడుతున్నారు. ముఖ్యంగా రాత్రిపూట గోతులు కనిపించక వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో మద్దిలపాలెం నుంచి సత్యం జంక్షన్‌కి వెళ్లే మార్గంలోను, ఇతర ప్రాంతాల్లోను గోతుల కారణంగా పలువురు ప్రమాదాలకు గురయి గాయాలపాలయ్యారు. కాగా జోన్–3 ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఇప్పటికే ఈ గోతులకు ప్యాచ్ వర్కుల నిమిత్తం హనుమంతవాకలో గల జాతీయ రహదారుల సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు లేఖ రాశారు. కాని అక్కడి నుంచి స్పందన లేదని సమాచారం.



పోర్టుటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా హైవేపై గోతులు

ప్యాచ్‌వర్కులు ఎప్పుడు చేస్తారు?

జాతీయ రహదారి మీద పలు ప్రాంతాల్లో గోతులు ఏర్పడ్డాయి. గతంలో ఎప్పటికప్పుడు ప్యాచ్‌వర్కులు చేసేవారు. జాతీయ రహదారి అంటే గోతుల రహితంగా ఉండేది. కాని కొన్నేళ్లుగా వర్షాలకు పలు చోట్ల గోతులు పడుతున్నా ప్యాచ్‌వర్కులు మాత్రం చేయలేదు. ఎప్పుడు చేస్తారో కూడా తెలియడం లేదు.

– జ్ఞానేశ్వర్, వాహనదారుడు, అక్కయ్యపాలెం

వెంటనే మరమ్మతులు చేయాలి..

జోన్–3 పరిధిలో గల జాతీయ రహదారికి వెంటనే ప్యాచ్‌వర్కులు చేయాలి. పలు ప్రాంతాల్లో పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా వర్షాలు పడేటప్పుడు గోతులు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా జాతీయ రహదారుల సంస్థ ఇంజినీర్లు స్పందించి మరమ్మతులు చేయాలి.

– వి. శ్రీనివాస్‌రావు, నక్కవానిపాలెం.

క్లుప్తంగా

ఉర్రూతలూగించిన స్కూల్ చాంపియన్ ఆడిషన్స్



స్టెప్పులేస్తున్న కార్తికేయరెడ్డి

సీతమ్మధార : సెప్టెంబర్ 15న విశ్వనాథ్ కన్వెన్షన్ పోర్టు స్టేడియంలో జరగనున్న వైజాగ్ స్కూల్ చాంపియన్స్, డ్యాన్స్ స్టార్ ఫైనల్ ఆడిషన్స్ గురుద్వార దగ్గరున్న రిపో వైజాగ్‌లో జరిగాయి. న్యాయ నిర్ణేతగా లావణ్య పాల్గొన్నారు. వెస్టన్ డ్యాన్స్ రైమ్స్, క్రియేటివ్ డ్రెస్, పెయింటింగ్ విభాగాల్లో జరిగిన ఆడిషన్స్‌కు మంచి స్పందన లభించిందని ఈవెంట్ దర్శకులు వీరుమామా తెలిపారు.

జెడ్పీ సీఈవోకు ఘనంగా వీడ్కోలు



పోలినాయుడు దంపతులను సత్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

మురళీనగర్ : జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా పని చేసి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చంనాయుడు ఓఎస్డీగా నియమితుడైన ఎం.పోలినాయుడును జెడ్పీ సిబ్బంది శనివారం ఘనంగా సత్కరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలినాయుడు దంపతులను ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రస్తుత సీఈవో డి.సత్యనారాయణ, కార్యనిర్వహణ ఇంజినీరు కె.శ్రీనివాసు పాల్గొన్నారు.

వైభవంగా సుప్రభాత సేవ

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించారు. తెల్లవారు జామున సన్నిధిగొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

మురళీనగర్ : మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తామని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి పి.చెల్వరాజు చెప్పారు. ఈ మేరకు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఈ వైద్య శిబిరంలో నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ సమృద్ధి ఆర్ దేశ్‌ముఖ్ పాల్గొని వైద్య పరీక్షలు చేస్తారన్నారు. మురళీనగర్ వాకర్స్, పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొని నేత్ర వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు.

గాజుల అలంకరణలో ఉమాదేవి



అల్లిపురం : శ్రావణ మాస పూజల్లో భాగంగా టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన శ్రీ ఉమాదేవి అమ్మవారిని ఆలయ అర్చకుడు భార్గవశర్మ రంగు రంగుల గాజులతో విశేషంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని నిమ్మకాయ డొప్పలతో నేతి దీపాలు వెలిగించి అమ్మవారికి నివేదించారు. అమ్మవారి సన్నిధిలో లలితా పారాయణ అనంతరం ఏక హారతి నుంచి నక్షత్ర హారతులతో అమ్మవారికి విశేష హారతులతో అమ్మవారిని ఆరాధించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు



శ్రీకృష్ణుడు, రుక్మిణి, సత్యభామ, గోపికల వేషధారణలో చిన్నారులు

మత్రిపాలెం : చిన్నారుల కృష్ణాష్టమి వేడుకలు చూపరులను ఆకట్టుకున్నాయి. స్థానిక జీవీఎంసీ 53వ వార్డులో గల పార్వతీనగర్‌లో అన్నూరు ప్లేస్కూల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో చిన్నారులు ఉట్టి కొట్టారు. కృష్ణుడు, గోపిక, రుక్మిణి, సత్యభామ వేషధారణలో అలరించారు. పాఠశాల కరెస్పాండెంట్ మహ్మద్ షరీఫ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించి భారతీయ సనాత సంప్రదాయాలను చిన్నారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫాల్ షహరత్ బీబీ, ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

పలు వేషాల్లో చిన్నారులు..



కృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 42వ వార్డు తాటిచెట్లపాలెంలో గల విశ్వతేజ స్కూల్ ఆవరణలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కృష్ణాష్టమి విశిష్టతను తెలిపారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐ. భాస్కరరావు, ఐ. సునీత, సిబ్బంది, చిన్నారులు, తల్లితండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.

మత్తు ముప్పు నుంచి పిల్లల్ని మనమే కాపాడుకోవాలి



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం

సీతమ్మధార: మాదక ద్రవ్యాల వైపు పిల్లలు ఆకర్షితులవకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సీతమ్మధారలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ బాలలపై లైంగిక దాడులు, మంచి–చెడు స్పర్శల గురించి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. పాఠశాలల ప్రాంగణాల్లో ఫిర్యాదుల పెట్టెల ఏర్పాటుపై డీఈవో చంద్రకళ చొరవ అభినందనీయమన్నారు. ఏయూ సైకాలజీ విభాగం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రుల కంటే పాఠశాలల్లోనే ఎక్కువ సమయం గడుపుతున్నందున, వారి మనసులను అన్ని కోణాల్లోనూ అనుకూలంగా మార్చేలా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రణాళికలు రూపొందించాలన్నారు. గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఖలీసా బేగం సమన్వయకర్తగా, ఎంఈవోలు డి.రామారావు, బాలమణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో వెంకటేశ్వరి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.విజయ, పిల్లల మనస్తత్వ నిపుణులు ఎం.సాయి, వంశీ, పార్వతీ కశ్యప్, డీసీపీయూ ప్రతినిధులు కె.శారద, కె.శకుంతల, ఆనంద్, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.మనోజ్, కె.వి జయకుమారి, సీఆర్పీలు, వార్డు సచివాలయల కార్యదర్శులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్యురాలిపై దాడి అమానుషం



ఆక్సిజన్ టవర్స్ వద్ద కొవ్వొత్తులతో వైద్యుల ప్రదర్శన

సీతమ్మదార : కోల్‌కతాలోని పీజీ డాక్టర్ అత్యాచార ఘటనను నిరసిస్తూ సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్స్ నివాసిత డాక్టర్లు నల్ల దుస్తులు ధరించి శనివారం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, వైద్యులకు రక్షణ కల్పించాలని డాక్టర్ శివాజీ ప్రసాద్, డాక్టర్ అనూష, డాక్టర్ సోమిని డిమాండు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ అన్నపూర్ణారావు, డాక్టర్ సురేఖ, ఉషారాణి, మురళీ మోహన్ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి సీజ్



గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన యువకులతో రైల్వే పోలీసులు

తాటిచెట్లపాలెం : విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను రైల్వే పోలీసులు శనివారం అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి సుమారు రూ. 88 వేలు ఖరీదు చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గవర్నమెంట్ రైల్వే పోలీసు (జీఆర్పీ), రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) సిబ్బంది రైల్వేస్టేషన్‌లో గల వివిధ ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహిస్తుండగా మాలప్పురం, కేరళకు చెందిన అబ్దుల్ మాలిక్, మహ్మద్ ముస్ఫిర్, మహ్మద్ ఫాజిల్ అక్రమంగా గంజాయి రవాణా చేయడం గుర్తించారు. వీరు ఈ గంజాయిని విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా కేరళకు తరలిస్తున్నట్లు తెలిపారు. వీరిని అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుండి సుమారు రూ. 88 వేల విలువైన 17.6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఎస్ఐ ఎస్.కె. అబ్దుల్ మారూఫ్‌కు అప్పగించినట్లు తెలిపారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ ఒబిషేక్ మిస్త్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

సివిల్ ఇంజినీరింగ్‌లో నైపుణ్యం పెంచుకోవాలి



అతిథులతో విద్యార్థులు

సీతమ్మధార : సివిల్ ఇంజినీరింగ్‌లో నైపుణ్యం పెంచుకునేందుకు టెక్లా నిర్మాణాల వంటి ఆడ్ ఆన్ కోర్సులు ఉపకరిస్తాయని డాక్టర్ లంకపల్లి బులయ్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ దీపక్ చౌదరి అన్నారు. కళాశాలలో ఈనెల 19 నుంచి 24 వరకు సివిల్ ఇంజినీరింగ్ విభాగం వనహ ఎడ్యుకేషన్ అండ్ ఇన్నోవేటివ్ ల్యాబ్స్‌తో కలిసి నిర్వహించిన టెక్లా నిర్మాణాలు, ఆడ్ ఆన్ కోర్సెస్ శనివారం ముగిసాయి. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ జి.టి. నాయుడు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ప్రాక్టికల్ ట్రెనింగ్ ఎంతో అవసరమన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వనహ ఎడ్యుకేషన్ అండ్ ఇన్నోవేటివ్ ల్యాబ్స్ కోల్‌కతా ప్రతినిధులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

28 నుంచి పెయింటింగ్‌లో ఉచిత శిక్షణ

మురళీనగర్ : మాధవదార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా పెయింటింగ్‌లో శిక్షణ నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వారం రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణ తరగతుల్లో డిజైనర్ పెయింటింగు ఆన్ బ్లౌజెస్, పూజలకు ఉపయోగించే కర్టెన్స్‌పై బ్యాక్ డ్రాప్ పెయింటింగు, గ్లాస్ పెయింటింగుపై కె.హిమబిందు శిక్షణ ఇస్తారని చెప్పారు. బిర్లా కూడలి అభిరుచి స్వీట్స్ సమీపంలో ఈ తరగతులు ప్రతి రోజు ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామన్నారు. మురళీనగర్, మాధవదార జంట కాలనీల మహిళలు 6303552016 నంబరుకు ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు.

చిన్నోడి పెద్ద మనసు

50 మంది విద్యార్థులకు రూ.6 లక్షల సాయమందించిన రోహన్ చెర్ల



పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం అందజేస్తున్న రోహన్ చెర్ల

డాబాగార్డెన్స్ : ప్రతిభ ఉండి ఆర్థిక పరిస్థితుల కారణంగా విద్యకు దూరం అవుతుంటారు చాలా మంది పేద విద్యార్థులు. అటువంటి వారికి చేయూతనిచ్చేందుకు ముందుకు వచ్చాడు 17 ఏళ్ల రోహన్ చెర్ల. రోహన్ తాత వారణాసి సూర్యనారాయణ మూర్తి విశాఖ మహా నగరంలో గల ఏవీఎన్ కళాశాలలో ఇంగ్లీషు అధ్యాపకునిగా పని చేశారు. ఆయన జ్ఞాపకార్థం కళాశాలలో బాగా చదువుతున్న పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించేందుకు రోహన్ చెర్ల ముందుకొచ్చాడు. ఈ మేరకు ఏవీఎన్ కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రోహన్ చెర్ల మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఆర్థిక చేయూతనందిస్తూ, వారి చదువుకు ప్రోత్సాహం అందివ్వడమే ధ్యేయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు మాట్లాడుతూ తాను చదువుకుంటూ పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. సుమారు 50 మంది విద్యార్థులకు రూ.6 లక్షలు అందజేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో జోసెఫ్ మార్షల్, సాయి హిరణ్మయి చెర్ల, రోహన్ కమత్, ఆకెళ్ల శైలజ, డాక్టర్ మహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, స్వరాజ్యలక్ష్మి, కళాశాల ఇంగ్లీషు విభాగాధిపతి పైడి రజనీ తదితరులు పాల్గొన్నారు.

ఆచరణాత్మక జ్ఞానంతో అద్భుత ఫలితాలు



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ సత్యనారాయణమూర్తి

మురళీనగర్ : ఆచరణాత్మక జ్ఞానంతోనే అద్భుత ఫలితాలు సాధ్యమవుతాయని ఆంధ్రా యూనివర్సిటీ రీజియన్ ఆర్‌జేడీ జె. సత్యనారాయణమూర్తి అన్నారు. ఏపీసీటీఈ ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వారం రోజులుగా తయారీ నాణ్యత అంశంపై నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు శిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఉత్పత్తుల సాధనలో శాస్త్రీయత, విశ్లేషణాత్మకత అంశాలకు ప్రాధాన్యతనివ్వడం ద్వారా నాణ్యతా ప్రమాణాలు సాధించగలమన్నారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని శిక్షణ పొందిన అధ్యాపకులు మెకానికల్ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచాలని సూచించారు. ఆంధ్రా యూనివర్సిటీ మెకానికల్ ఇంజినీరింగ్ ప్రొఫసర్ డాక్టర్ కె. రాంజీ మాట్లాడుతూ నైపుణ్యం విద్యార్థులకు అత్యంత శక్తివంతమైన పరికరమన్నారు. విశాఖ రిఫైనరీ డీజీఎం కేఈ శ్రీధర్ మాట్లాడుతూ తయారీలో నాణ్యత నిర్వహణ పరిశ్రమల్లోనే కాకుండా నిజ జీవితంలో కూడా ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులకు ధ్రువపత్రాలు అందించారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.నారాయణరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ విశ్రాంత జనరల్ మేనేజర్ ఒ.రామ్మోహనరావు, గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ, పెందుర్తి పాలిటెక్నిక్ ఓఎస్డీ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్, మెకానికల్ ఇంజినీరింగు హెడ్ కె.మధుకుమార్, ఇతర విభాగాల హెడ్‌లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

డంపర్ బిన్ తరలించారు



వేరే ప్రాంతానికి తరలించిన డంపర్ బిన్

సాక్షి ఎఫెక్ట్..

కంచరపాలెం : కంచరపాలెం పరిధి రామ్మూర్తి పంతులుపేట ఉన్నత పాఠశాల ప్రధాన గేటు వద్ద జీవీఎంసీ పబ్లిక్ హెల్త్‌కు సంబంధించిన డంపర్ బిన్లు తరలించారు. కంచరపాలెం, ఆర్పీపేట ప్రాథమిక, రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాలల ప్రధాన గేటు వద్ద డంపర్ బిన్లు ఏర్పాటు చేయడంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారాయి. ఇక్కడ సమస్యపై 24న సాక్షి దినపత్రికలో 'డంపర్ బిన్‌తో దుర్గంధం' శీర్షికన వెలువడిన కథనానికి జోన్–5 పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ. సునీల్‌కుమార్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు శనివారం వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ జె. రమేష్ పర్యవేక్షణలో జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది డంపర్ బిన్‌ను ఆ ప్రాంతం నుంచి తరలించారు.